


నేటి పత్రిక
# ప్రజా వార్త
NETI PATRIKA PRAJA VARTHA
తెలుగు వారపత్రిక



TELUGU ONLINE DIGITAL NEWS PORTAL & ONLINE CHANEL
Prajavatha-Online Telugu News
http://www.prajavartha.com
వీక్షించండి .. చదవండి... చెప్పండి...



విజయవాడ | తేదీ: 16 - 23 జూన్ 2023 | ఎడిటర్ : కొండూరి శ్రీనివాసరావు | సంపుటి : 2 | సంచిక : 53 | పేజీలు : 4, వెల: రూ.5


## మరో ప్రతిష్టాత్మక ప్రయోగానికి ఇస్రో సన్నద్ధం..

**చంద్రయాన్-3 మిషన్‌కు శ్రీహరికోటలో శరవేగంగా ఏర్పాట్లు..**



**శ్రీహరికోట, నేటి పత్రిక ప్రజావార్త:**
భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ప్రతిష్టాత్మక ప్రయోగానికి సిద్ధమవుతోంది. మరికొన్ని రోజుల వ్యవధిలోనే కీలక ఘట్టం అవిష్కృతం కానుంది.. అది కూడా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ప్రయోగం చేపట్టనుంది. రికార్డు స్థాయి ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రవేశపెడుతూ ప్రపంచ దేశాలను సైతం ఆకట్టుకుంటున్న ఇస్రో.. చంద్రుడి పై మరిన్ని పరిశోధనలు చేపట్టేందుకు సిద్ధమైంది. అత్యాధునిక టెక్నాలజీతో జులై రెండవ వారంలో ఎల్‌వీఎం-3 రాకెట్ ద్వారా చంద్రయాన్ 3 ప్రయోగానికి ఏర్పాట్లు పూర్తి కావస్తున్నాయి. ఇప్పటికే ఇస్రో హెడ్ క్వార్టర్ అయిన బెంగుళూరులో శాటిలైట్ అనుసంధాన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అన్ని పనులు అనుకున్న సమయానికి పూర్తయితే చంద్రయాన్ 3 మిషన్ ప్రయోగాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుండి జూలై 12న ప్రయోగించేందుకు ప్రయోగ సన్నాహాలను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో చంద్రుని పై పరిశోధనలు చేసేందుకు మొట్టమొదటిసారిగా 2008వ సంవత్సరంలో అక్టోబర్ 24 వ తారీఖున 380 కోట్ల రూపాయల ఖర్చుతో ఇస్రో మొట్టమొదటిసారిగా చంద్రుడిపై ప్రయోగాలు చేపట్టి చంద్రునిపై నీటి జాడలు ఉన్నాయని కనుగొని భారతమాత జెండాను నాటిన సత్తా ఇస్రో చాటుకుంది. అయితే చంద్రుని కక్షపై మరింతగా అన్వేషణలు చేపట్టాలని దాల్చిన ఇస్రో 2019 జూలై 22న జీఎస్ఎల్వీ మార్క్..3 రాకెట్ ప్రయోగం ద్వారా చంద్రుని పైకి రెండవసారి ప్రయోగం చేపట్టి ఆర్బిటర్ సహాయం ద్వారా చంద్రుని కక్షలోకి ప్రవేశపెట్టి అచ్చట నుండి ల్యాండర్ను చంద్రగ్రహణం పైకి దింపి ల్యాండర్ నుండి రోవర్ను చంద్రునిపై దింపి 14 రోజులు పాటు అన్వేషణలు చేపట్టి చంద్రుని ఉపరితలంపై ఏమి ఏమి నిక్షేపాలు, ఖనిజాలు, లేదా ఏమైనా మౌలిక వనరులు ఉన్నాయో అవి మానవాళికి ఏవిధంగా ఉపయోగపడతాయో ప్రయోగాలు చేయడానికి ఇస్రో చంద్రయాన్..2 ప్రయోగం ను చేపట్టింది. అయితే చంద్రయాన్ 2 ప్రయోగం ద్వారా లునార్ ఆర్బిటర్ సహాయంతో చంద్రుని కక్షలో చేరాక ఇస్రో శాస్త్రవేత్తలు ప్లాన్ ప్రకారమే ఆర్బిటర్ చంద్రుని పై నుండి ల్యాండర్ విడిపోయాయి.. ఆ తర్వాత ల్యాండర్ చంద్రుడు పై కక్ష నుండి చంద్రుడు ఉపరితలం పైకి ప్రయాణం సాగించింది.ల్యాండ్ చంద్రుడు ఉపరితలం పై నుండి రెండు కిలోమీటర్లు ఎత్తున ఉండగానే భూమితో సంబంధాలు తేగిపోయాయి. దీంతో ఇస్రో శాస్త్రవేత్తలకు నిరాశను మిగిల్చింది, అయితే చంద్రయాన్ 2 ప్రయోగం 90% విజయం సాధించినట్లు ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ నేపథ్యంలోనే చంద్రునిపై నిక్షేపాలును కనుగొనాలని ఇస్రో మరింతగా అన్వేషణ జరపాలని చంద్రయాన్ 3 ప్రయోగాన్ని 2023 జూలైలో కానీ ఆగస్టు మాసంలో కానీ జీఎస్ఎల్వి మార్క్ 3 రాకెట్ ప్రయోగం ద్వారా ప్రయోగం చేపట్టాలని ఇస్రో శ్రీకారం చుట్టింది. చంద్రయాన్ 1, చంద్రయాన్ 2 ప్రయోగాలలో ఏయే సాంకేతిక లోపాలు తలెత్యాయో వాటిని సున్నితంగా పరిశీలించింది. గతంలో తలెత్తిన సాంకేతిక లోపాలపై వివిధ రకాల పరిశోధనలు చేపట్టిన ఇస్రో శాస్త్రవేత్తలు.. ఇప్పుడు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి చంద్రయాన్ 3 ప్రయోగం చేపట్టనున్నారు.

# క్షయవ్యాధిని నిర్మూలించడమే భారత్ లక్ష్యం

**'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ**

**న్యూఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త :**
మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ దేశప్రజలతో సంభాషించారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో ఇది 102వ ప్రసారం ఇవాళ ఉదయం జరిగింది. మన్ కీ బాత్ కార్యక్రమాన్ని నెలలో చివరి ఆదివారం నిర్వహిస్తారు.. కానీ ఈసారి అది జూన్ 18న మాత్రమే జరిగింది. సాధారణంగా ప్రతి నెలా చివరి ఆదివారం 'మన్ కీ బాత్' మీ ముందుకు వస్తుందని.. అయితే ఈసారి అదివారం ముందు జరుగుతుందని ప్రధాని మోదీ ప్రారంభంలోనే తెలిపారు. పిఎం మోడీ ఇంకా మాట్లాడుతూ, మీ అందరికీ తెలుసు, నేను వచ్చే వారం అమెరికాలో ఉంటాను మరియు అక్కడ షెడ్యూల్ చాలా బిజీగా ఉంటుంది, కాబట్టి నేను వెళ్ళే ముందు, నేను మీతో మాట్లాడాలి, ఇంతకంటే మంచిది ఏమి ఉంటుంది అని అనుకున్నాను.

ఛత్రపతి శివాజీ మహారాజ్‌ని స్మరించుకుంటూ ప్రధాని మోదీ ఇలా అన్నారు. "ఛత్రపతి శివాజీ మహారాజ్ ధైర్యసాహసాలతో పాటు, అతని పాలన, అతని నిర్వహణ నైపుణ్యాల నుంచి నేర్చుకోవలసినది చాలా ఉంది. ముఖ్యంగా నీటి నిర్వహణ, నౌకాదళానికి సంబంధించి ఛత్రపతి శివాజీ మహారాజ్ చేసిన కృషి గురించి చెప్పుకోవాలన్నారు. నేటికీ భారతదేశ చరిత్రకు గర్వకారణం. అని గుర్తు చేసుకున్నారు ప్రధాని నరేంద్ర మోదీ.

బిపార్జోయ్ తుఫానును ప్రస్తావిస్తూ, ప్రధాని మోదీ మాట్లాడుతూ, రెండు మూడు రోజుల క్రితం దేశంలోని పశ్చిమ ప్రాంతాన్ని ఎంత పెద్ద తుఫాను తాకిందో చూశాము. బలమైన గాలులు, భారీ వర్షం. బిపార్జోయ్ తుఫాను కచ్‌లో భారీ వినాశనానికి కారణమైంది, అయితే కచ్ ప్రజలు ఇంత ప్రమాదకరమైన తుఫానుతో పోరాడిన ధైర్యం మరియు సంసిద్ధత సమానంగా అపూర్వమైనది. ఒకప్పుడు రెండు దశాబ్దాల క్రితం సంభవించిన భూకంపం తర్వాత కచ్ ఎప్పటికీ కోలుకోలేదన్నారు. ప్రస్తుతం అదే జిల్లా దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాల్లో ఒకటిగా ఉందని గుర్తు చేశారు. బిపార్జోయ్ తుఫాను కారణంగా ఏర్పడిన విధ్వంసం నుంచి కచ్ ప్రజలు త్వరగా కోలుకుంటారని నేను ఖచ్చితంగా అభిలాషించారు.

**2025 నాటికి టిబి రహిత భారతదేశం**

2025 నాటికి టీబీని నిర్మూలించాలని భారత్ సంకల్పించిందని ప్రధాని మోదీ అన్నారు. స్వేచ్ఛా భారతదేశాన్ని తయారు చేయాలనే లక్ష్యం కచ్చితంగా పెద్దదే. ఒకప్పుడు టి.బి. గురించి తెలిసిన తర్వాత కుటుంబ సభ్యులు దూరంగా వెళ్ళేవారు. కానీ ఇప్పుడు అలా లేదు. నేటి సమయంలో టిబి రోగిని కుటుంబంలో సభ్యునిగా చేయడం



ద్వారా సహాయం చేస్తున్నారు.

# తిరుపతి వాసులకు అద్భుత అవకాశం

**తిరుపతి, నేటి పత్రిక ప్రజావార్త :**
తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులతో పాటు తిరుపతి నగర వాసులకు తిరుపతి చుట్టుపక్కల అందాలను ఆకాశం నుంచి తిలకించేందుకు అద్భుత అవకాశం అందుబాటులోకి వచ్చింది. 'ఏరో డాన్' అనే సంస్థ తీసుకు వచ్చిన జాయ్ రైడ్‌ని శుక్రవారం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు.



అనంతరం ఎమ్మెల్యే చెవిరెడ్డి ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డితో కలసి హెలికాప్టర్ ఎక్కి చంద్రగిరి కోట వరకు వెళ్లి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి పోలీస్ గ్రౌండ్ నుంచి ప్రారంభమయ్యే జాయ్ రైడ్ వల్ల తిరుపతి, చంద్రగిరి చుట్టు ప్రక్కల ప్రదేశాలను విహంగ వీక్షణం చేయొచ్చని, నాలుగు రోజుల పాటు ట్రయల్ రన్ నిర్వహిస్తారని వెల్లడించారు. ఆరు సీట్ల కెపాసిటీ వున్న హెలికాప్టర్‌లో పైలట్ కాకుండా ఐదుగురు పర్యాటకులు ఎక్కేందుకు అవకాశముందన్నారు. చంద్రగిరి కోట అందాలను ఆకాశం నుంచి తిలకించే అద్భుతమైన అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఏరోడాన్ సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ తిరుపతి పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ నుంచి చంద్రగిరి పోర్టు వరకు వెళ్లి తిరిగి తీసుకొస్తామని, ఈ రైడ్ కేవలం 8 నిమిషాల్లోనే పూర్తవుతుందని, ఒకగంటకు ఆరు రైడ్లు నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇందుకోసం ఒక్కొక్కరికి రూ.6 వేలు వసూలు చేస్తున్నట్లు వివరించారు. శ్రీవారి దర్శనం కోసం తిరుపతికి వచ్చే వేలాది మంది భక్తులతో పాటు తిరుపతి వాసులకు చుట్టు పక్కల అందాలను ఆకాశం నుంచి చూపించాలనే మంచి ఉద్దేశంతోనే ఈ రైడ్ ప్రారంభిస్తున్నట్లు ఏరో డాన్ ప్రతినిధులు చెప్పారు.

నాలుగు రోజుల పాటు నిర్వహించే రైడ్ సక్సెస్ అయితే తిరుపతి టు చెన్నై మార్గంలో కూడా ప్రవేశపెట్టే ఆలోచన ఉందని స్పష్టం చేశారు.

### జగనన్న సురక్షతో
# అర్హులందరికీ లబ్ధి

**సీఎం జగన్ స్పష్టీకరణ**

**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డులు, పెన్షన్ల కోసమే గతంలో ఉద్యమాలు జరిగేవని.. అలాంటిది తాము ఎలాంటి వివక్ష లేకుండా పౌర సేవలు అందించగలుగుతున్నామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉద్ఘాటించారు. అయితే.. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందించాలనే సదుద్దేశంతోనే జగనన్న సురక్ష తీసుకొచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు. ఎక్కడా లంచాలకు తావు లేకుండా పారదర్శకంగా సేవలు అందిస్తున్నాం. ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ సేలు అర్హులందరికీ అందాలి. వివిధ కారణాలతో మిగిలిన లబ్ధిదారులకు మంచి చేయడమే జగనన్న సురక్ష తీసుకొచ్చాం. అర్హత ఉండి కూడా.. చిన్నచిన్న కారణాల వల్ల మిగిలిపోయిన వాళ్లకు లబ్ధి చేకూరుస్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.



"నవరత్నాల ద్వారా రూ.2 లక్షల 16వేల కోట్లు అందించాం. నేరుగా బటన్ నొక్కి అక్కాచెల్లెమ్మల ఖాతాల్లో నగదు జమ చేశాం. పేదవాడికి మంచి జరగాలన్నదే ప్రభుత్వ సంకల్పం. పేదల పట్ల ప్రేమ చూపిస్తున్న ఏకైక ప్రభుత్వం మనదే. లంచాలకు తావులేకుండా 600 రకాల పౌర సేవలు అందిస్తున్నాం. ఈ నాలుగేళ్లలో గ్రామస్వరాజ్యం తీసుకొచ్చాం. అవినీతి రహిత పాలనే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు సీఎం జగన్ స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాల్లో నెలరోజులపాటు 'జగనన్నకి చెబుదాం' కార్యక్రమానికి కొనసాగింపుగా.. జగనన్న సురక్ష కార్యక్రమం జరగనుంది. ప్రతీ సచివాలయంలోనూ క్యాంప్ నిర్వహించేలా ఏర్పాటు చేశారు. దీనికోసం 1902 హెల్ప్‌డెస్క్ కూడా ఏర్పాటు చేశారు. సమస్యలేవైనా ఉంటే ఈ నెంబర్‌కు డయల్ చేయొచ్చు.

'మొదటి అడుగుగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు ఒక టీమ్‌గా ఏర్పడి వారం రోజుల పాటు రాష్ట్రంలో ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధి అందని వారిని గుర్తించి సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తారని సీఎం జగన్ పేర్కొన్నారు. సచివాలయాలకు వెళ్లి సర్వీస్ నెంబర్ రిజిస్టర్ చేసి టోకెన్ తీసుకుని తిరిగి ఆయా కుటుంబాలకు అందిస్తారు. సచివాలయాల పరిధిలో ఎప్పుడు క్యాంపులు పెడతారో వారికి చెప్పి ఆరోజు వారిని క్యాంపులకు తీసుకొచ్చి

సమస్య పరిష్కరించేలా చూస్తారు. మండల స్థాయి అధికారులతో కూడా బృందాలు ఒక రోజంతా సచివాలయాల్లోనే ఉండి సమస్యలను పరిష్కరిస్తారు ప్రతి మండలంలో ప్రతి రోజూ 2 సచివాలయాలు కవర్ అవుతాయి. జూలై 1వ తేదీ నుంచి కూడా ఈ క్యాంపులను నిర్వహిస్తారు. ఎలాంటి చార్జీలు లేకుండానే ఈసేవలు అందిస్తారు. 26 జిల్లాలకు ప్రత్యేక సీనియర్ అధికారులను పర్యవేక్షక అధికారులుగా నియమించాం. పేదల పట్ల ప్రేమ చూపిస్తున్న ఏకైక ప్రభుత్వం మనదే అని సీఎం జగన్ తెలిపారు.

అన్ని క్యాంపుల్లో కూడా సేవలు అందుతన్న తీరుపై తనిఖీలు చేస్తారు. ఈ కార్యక్రమం జరుగుతున్న తీరుపై జిల్లా కలెక్టర్లు రోజువారీ సమీక్షలు చేస్తారు. వారానికి ఒకరోజు సీఎంఓ, చీఫ్ సెక్రటరీలు మానిటరింగ్ చేస్తారు. సచివాలయాల్లో క్యాంపులో నిర్వహించేటప్పుడు సదుపాయాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.క్యాంపులు జరుగుతున్నప్రుడు కచ్చితంగా ఎమ్మెల్యేలు సందర్శించాలి. జగనన్నకు చెబుదాం ద్వారా వచ్చిన సమస్యలను ఇదే కార్యక్రమంలో మిళితం చేసి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలి. ప్రజలు పూర్తిగా సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలి అని సీఎం జగన్ స్పష్టం చేశారు.

# అంతర్జాతీయ సంస్థ 'ఈటీఎస్'తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
విద్యారంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులను చేపట్టిన నేపథ్యంలో పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను 'టోఫెల్' పరీక్షకు సన్నద్ధం చేస్తూ ప్రముఖ అంతర్జాతీయ సంస్థ ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీసెస్ (ఈటీఎస్)తో రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఒప్పందం చేసుకుంది.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు ప్రపంచ స్థాయికి ఎదిగేలా అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్నట్టు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. తమ ప్రభుత్వం అట్టడుగు వర్గాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులను చేపడుతోందని తెలిపారు. రాష్ట్రంలోప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యారంగంలో తమ ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులను పరిశీలించాలని ఈటీఎస్ బృందాన్ని ఆహ్వానించారు.

రాష్ట్రంలో 6వ తరగతి, ఆపై తరగతులకు సంబంధించి మొత్తం 63 వేల తరగతి గదులకు గాను 30,230 క్లాస్ రూమ్‌లు అంటే 50 శాతం జూలై చివరి నాటికి డిజిటలైజ్ చేస్తున్నాం. మిగిలిన వాటిని డిసెంబరు నాటికి సిద్ధం చేస్తాం. 8వ తరగతిలోకి అడుగు పెడుతున్న ప్రతి విద్యార్ధి కి ట్యాబ్‌లు పంపిణీ చేశాం. ఈ ఏడాది డిసెంబరు 21న మళ్లీ ట్యాబ్‌ల పంపిణీ చేపడతాం. బైజూస్ సంస్థతో చేసుకున్న ఒప్పందం ప్రకారం విద్యార్థులకు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా కంటెంట్‌ను అందుబాటులో ఉంచుతున్నాం. 1 నుంచి 9వ తరగతి వరకు ద్విభాషా (బైలింగ్యువల్) పాఠ్యపుస్తకాలను సరఫరా చేశాం. వచ్చే ఏడాది 10వ తరగతికి కూడా ద్విభాషా పుస్తకాలను అందిస్తాం. టెన్త్ విద్యార్థులు 2025లో సీబీఎస్ఈ పరీక్షలకు ఇంగ్లిష్ మీడియంలో హాజరవుతారు.

రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ స్కూళ్లను అభివృద్ధి చేస్తున్నాం. దాదాపు 45 వేల ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాడు- నేడు ద్వారా మౌలిక వసతులు కల్పిస్తున్నాం. తొలిదశలో ఇప్పటికే 15,750కిపైగా స్కూళ్లను అభివృద్ధి చేయగా డిసెంబరు నాటికి మరో 16 వేలకు పైగా స్కూళ్లలో రెండో దశ పనులు కూడా పూర్తవుతాయి. వచ్చే ఏడాది మిగిలిన స్కూళ్లలో పనులు చేపడతాం. విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ క్రమంలో ప్రతి విద్యార్థికి ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీని ఉచితంగా అందిస్తున్నాం. వీటికి అదనంగా ఇప్పుడు టోఫెల్ ప్రైమరీ, టోఫెల్ జూనియర్, టోఫెల్ సీనియర్ పరీక్షలను కూడా ప్రవేశపెడుతున్నాం. ఇది మంచి మార్పులకు దారితీస్తుంది. ఇదంతా మానవ వనరులపై పెడుతున్న పెట్టుబడిగా భావిస్తున్నాం. కచ్చితంగా ఈ కార్యక్రమం ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుంది.

ఒప్పందంలో ముఖ్యాంశాలు..

టోఫెల్ పరీక్షలు నిర్వహించే అంతర్జాతీయ సంస్థ ఈటీఎస్‌తో ఒక రాష్ట్ర ప్రభుత్వం నేరుగా ఒప్పందం చేసుకోవడం ఇదే ప్రథమం. ఈ ఒప్పందం ద్వారా అమెరికన్, యూరోపియన్ ఉచ్చారణలో పిల్లల నైపుణ్యాలను పెంపొందిస్తారు. విదేశీ యాసను అర్థం చేసుకోవడమే కాకుండా విద్యార్థులు చక్కగా మాట్లాడేలా శిక్షణ ఇస్తారు. 3, 4వ తరగతి పిల్లలకు విద్యా సంవత్సరం చివరలో మార్చిలో సర్టిఫైడ్ సన్నాహక పరీక్ష నిర్వహిస్తారు. 5వ తరగతి పిల్లలకు అక్టోబరులో మరో సన్నాహక పరీక్ష అనంతరం మార్చిలో తుది పరీక్ష టోఫెల్ ప్రైమరీని నిర్వహిస్తారు. 6-8వ తరగతి విద్యార్థులకు విద్యా సంవత్సరం చివరిలో సర్టిఫైడ్ సన్నాహక పరీక్ష ఉంటుంది. 9వ తరగతి విద్యార్థులకు అక్టోబరులో మరో సర్టిఫైడ్ సన్నాహక పరీక్ష నిర్వహిస్తారు. తుది పరీక్ష టోఫెల్ జూనియర్ విద్యా సంవత్సరం చివరిలో జరుగుతుంది. 10వ తరగతి విద్యార్థులకు టోఫెల్ జూనియర్ స్పీకింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడంలో భాగంగా 3-5 తరగతుల వారికి వారానికి మూడుసార్లు గంట సేపు స్మార్ట్ టీవీల ద్వారా ఆడియో, వీడియో కంటెంట్‌ను వినిపిస్తారు. 6-10వ తరగతి పిల్లలకు ఐఎఫ్‌పీల ద్వారా వారానికి మూడుసార్లు వీడియోలు ప్రదర్శిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందుతారు. అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులు చదివే స్కూళ్లలో ఇంగ్లిష్ టీచర్లను మెరుగైన శిక్షణ, అవగాహన కోసం అమెరికాలోని ప్రిన్స్టన్‌కు మూడు రోజులపాటు పంపిస్తారు. ఒప్పందంలో భాగంగా టోఫెల్ పరీక్షలను సీనియర్ లెవెల్‌కూ (ప్లస్ -1, ప్లస్ -2) విస్తరించాలని సీఎం ఆదేశించారు. ఈటీఎస్‌తో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందం విద్యలో నాణ్యత పెంచేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. విద్యాపరంగా, వృత్తిపరంగా ఏపీ విద్యార్థులకు మంచి అవకాశాలు దక్కుతాయి.

ఈ కార్యక్రమంలో అలైన్ డౌమాస్, ఈటీఎస్ సీనియర్ డైరెక్టర్, 'ఈటీఎస్' ఇండియా చీఫ్ రెవెన్యూ ఆఫీసర్ లెజో సామ్ ఊమెన్, సర్వశిక్ష అభియాన్ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, మిడ్ డే మీల్స్ డైరెక్టర్ నిధి మీనా, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, ఈటీఎస్ అసెస్‌మెంట్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ రుయి ఫెరీరా, డేనియల్, యూఫీఎస్ లెర్నింగ్ సహ వ్యవస్థాపకుడు అమిత్ కపూర్, చీఫ్ గ్రోత్ ఆఫీసర్ కపిల్, వైస్ ప్రెసిడెంట్ డిజిటల్ సేల్స్ ఇండియా కే-12 రాజీవ్ రజ్దాన్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# యువత భాగస్వామ్యంతోనే దేశాభివృద్ధి

## కేంద్ర మంత్రి భగవత్ కిషన్ రావ్ కరాడ్




**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

దేశ జనాభాలో 50 శాతం కన్నా అధికంగా ఉన్న యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించడం ద్వారా దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యానికి ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పించారని... అందులో భాగంగా నిర్వహిస్తున్న రోజ్‌గార్ మేళాల ద్వారా ఇప్పటికి దాదాపు నాలుగు లక్షల మందికి పైగా ఉపాధి పొందారని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కిషన్ రావ్ కరాడ్ పేర్కొన్నారు. మంగళవారం విజయవాడ రైల్వే ఆడిటోరియంలో నిర్వహించిన 6వ విడత రోజ్‌గార్ మేళాను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా మొత్తం 10 లక్షల మందికి ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రధాని దీనిని ప్రారంభించారని అన్నారు. 6వ విడత రోజ్‌గార్ మేళాలో భాగంగా మొత్తం 43 ప్రాంతాలలో 70 వేల మందికి వివిధ ప్రభుత్వ విభాగాలలో ఉపాధి నియామక పత్రాలను అందజేస్తున్నామని.. ప్రధాని మోడీ డిల్లీ నుంచి వర్చువల్ విధానంలో ఈ నియామక పత్రాలను అందజేస్తున్నారని తెలిపారు.

ప్రభుత్వరంగ బ్యాంకులు, రైల్వే, కపవద సిపిడబ్ల్యుడి, తపాలా శాఖ, ఐఐటి సహా తదితర శాఖలలో నియామక పత్రాలను ఇవ్వడం జరిగిందన్నారు. విజయవాడలో 117 మందికి మంత్రి నియామక పత్రాలను అందజేశారు.

భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 2047 నాటికి వందేళ్లు పూర్తి కానున్న 'ఆజాదీ క అమృత్ కాల్' సందర్భంగా దేశ అభివృద్ధికి తోడ్పడటంలో ప్రభుత్వం యువతకు ప్రాధాన్యం కల్పిస్తుందని మంత్రి పేర్కొన్నారు. 2014 లో దేశ ఆర్థిక వ్యవస్థ 10వ స్థానంలో ఉండగా, గడచిన 9 ఏళ్లలో సాధించిన ప్రగతి కారణంగా 5వ స్థానానికి చేరుకున్నామని అన్నారు. దేశ బడ్జెట్ వ్యయం 16 లక్షల కోట్ల రూపాయల నుంచి దాదాపు మూడు రెట్లు అంటే 45 లక్షల కోట్ల రూపాయలకు చేరుకుందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఒక్క భారతదేశంలోనే 40 శాతం మేర డిజిటైజేషన్ ప్రక్రియ కేంద్ర ప్రభుత్వ హయాంలో జరుగుతోందని మంత్రి భగవత్ కిషన్ రావ్ కరాడ్ వివరించారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, రైల్వే, పోస్టల్, బిఎస్ఎఫ్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నగరంలో "యోగ్య సూత్రియం, క్షార సూత్ర మరియు లేజర్ ఫైల్స్ క్లినిక్" ప్రారంభం



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త:**

అక్షయ గ్రూప్ ఆఫ్ ఆయుర్వేద హాస్పిటల్స్ ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా ఆయుర్వేద వైద్య విద్యార్థుల కోసం ప్రారంభించినదని ప్రముఖ ఆయుర్వేద డాక్టర్ భానుప్రకాష్ అన్నారు. స్థానిక బందర్‌రోడ్‌లో శుక్రవారం నూతనంగా ప్రారంభించబడిన యోగ్య సూత్రియం, క్షార సూత్ర మరియు లేజర్ ఫైల్స్ క్లినిక్ వెస్ట్ శాసనసభ్యులు వెల్లంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ భాగ్యలక్ష్మి ప్రారంభించి డాక్టర్ పట్నాన భానుప్రకాష్, డాక్టర్ రాగసుధలను అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ భానుప్రకాష్, మాట్లాడుతూ అక్షయ హాస్పిటల్స్ 2007 సంవత్సరం మొదలుపెట్టామని అప్పటినుండి ఎన్నో శస్త్ర కర్మలు చేసి ఎంతో అనుభవం సంపాదించామని అన్నారు. ఎన్‌సిఐ ఎస్ఎం పోస్ట్ గ్రాడ్యుయేట్‌లో సర్జరీ శల్య తంత్ర చేసిన వారికీ 60 రకాల ఆపరేషన్స్‌కి అర్హత కల్పించారు. ఈ ఇన్స్టిట్యూట్ ద్వారా సుశ్రుత సంహితలో చెప్పబడిన అష్ట విధ శస్త్ర కర్మలు దాటి ఆధునిక సాంకేతిక విద్యలో ఏమి ఉండవని ఆయన అన్నారు. ఈ ఇన్స్టిట్యూట్ ద్వారా ఆయుర్వేద వైద్య విద్యార్థు లకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఆడవారికి వచ్చే మూల వ్యాధులకు సిగ్గుతోను, బిడియంతోనూ, ఆడ డాక్టర్లు లేకపోవడం వలన చూపించు కోకపోవడం జరుగుతున్నదని, అక్షర గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ డాక్టర్ రాగసుధ ప్రోక్టోలాజిస్ట్, వైద్యసేవలు అందిస్తున్నార న్నారు. ఆడవారు ముందుకు వచ్చి ఆడవారి ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు, చూపించుకోవలసిందిగా కోరుచున్నా మని డాక్టర్ భానుప్రకాష్ అన్నారు. ఈ కార్యక్రమంలో మరుపిళ్ల రాజేష్, మండేపూడి చటర్జీ, గురు మహంతి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# యోగ శక్తితో సయాటికా విముక్తి



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

అంతర్జాతీయ యోగా ఉత్సవాలలో భాగంగా, కానూరు అశోక్‌నగర్ ,"ఇండియన్ ఓం" కార్యాలయంలో యోగాశక్తి సాధన సమితి ఆధ్వర్యంలో సయాటికా వ్యాధిపై అవగాహన సదస్సు, మరియు చికిత్సలో పాల్గొన్న డాక్టర్ మాకాల సత్యనారాయణ ప్రసంగిస్తూ యోగాశక్తి చికిత్సలో సయాటికకు పూర్తి విముక్తి లభిస్తుందని అన్నారు. ఈ వ్యాధి మూత్రశయ నాడి మరియు గాల్ బ్లాడర్ నాడీలో వచ్చు, హెచ్చుతగ్గులే మూల కారణమని చెప్పారు. ఈ వ్యాధి కలిగిన వారు ప్రతిరోజు క్రమం తప్పక ప్రాణాయం చేయాలని, నాణ్యమైన ఆహారం, ఆర్గాన్ క్లాక్ ప్రకారం తీసుకోవాలని అన్నారు. జిబి 30 యూబీ 40 మరియు యుబి 60 నాడి కేంద్రాలను సమస్య ఉన్న వైపు మర్ధన చేయాలని చెప్పారు. చేతి మధ్య వేలుకు మర్ధన చేస్తే పూర్తిస్థాయి ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. యోగ తెరపిస్టులు కొండవీటి సుమతి, మా చూరి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులు డిమాండ్ల సత్వర పరిష్కారం కోరుతూ ధర్నా



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల పింఛను అప్డేషన్ మరియూ ఇతర డిమాండ్ల సత్వర పరిష్కారం కోరుతూ బుధవారం గాంధీనగర్, ధర్నా చౌక్ లో ధర్నా చేశారు. ఈ ధర్నాకు అల్ ఇండియా బ్యాంక్ పెన్షనర్స్ అండ్ రిటైరీస్ కాన్ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ కే.సూర్యనారాయణమూర్తి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కే.బీ.జీ.తిలక్, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఉప్పు సుధాకర్, ఇతర అనుబంధ సంఘాల ప్రతినిధులు హాజరై సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. పింఛను చట్టం 35(1) అనుసరించి కేంద్ర ప్రభుత్వ/ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశ్రాంత ఉద్యోగుల పింఛను తరహాలోనే సత్వర పింఛను అప్డేషన్, 2002 నవంబర్‌కు పూర్వం రిటైర్ అయిన విశ్రాంత ఉద్యోగులకు నూరుశాతం కరువు భత్యంతో లెక్కించిన పింఛను అమలు, బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్య భీమా పూర్తి ప్రీమియం సదరు బ్యాంకులు చెల్లించేలా ఆదేశాలు, బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల పింఛను గణనలో 10వ ద్వైపాక్షిక వేతన ఒప్పందంలో ప్రవేశ పెట్టబడిన ప్రత్యేక అలవెన్స్ ను పరిగణించుట, సమాలోచన, సలహా సంఘాలలో బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సంఘాలకు స్థానం కల్పించుట, తదితర న్యాయమైన డిమాండ్ల సత్వర పరిష్కారము కోరుతూ కేంద్ర ప్రభుత్వ ఆర్థికశాఖాధికారులకు మరియు ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ ఛైర్మన్ కి ఈమెయిల్ ద్వారా మెమొరాండం సమర్పించారు.విజయవాడ, గుంటూరు, ఏలూరు, భీమవరం, తాడేపల్లిగూడెం మరియు సమీప పట్టణాలనుండి సుమారు 200 మంది బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులు ఈ ధర్నాలో పాల్గొన్నారు.

# ఘనంగా కెనరా బ్యాంక్ గోల్డ్ అప్రైజర్ యూనియన్ మూడవ మహాసభలు




**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త:**

కెనరా బ్యాంక్ గోల్డ్ అప్రైజర్ మూడవ మహాసభ విజయవాడలోని కబేళా సెంటర్, ఊర్మిళానగర్‌లో ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో శనివారం యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదరాడ శ్రీనివాసరావు అధ్యక్షతన ఘనంగా జరిగింది. స్థానిక లైన్స్ క్లబ్ వారి సహకారంతో ఈదరాడ శ్రీనివాసరావు రక్తదాన శిబిరం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించగా సుమారు 48 మంది యూనియన్ సభ్యులు రక్తదానం చేసారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు శాఖల్లో పనిచేస్తున్న అప్రైజర్స్‌లో ఉత్తమ ప్రతిభ బ్యాంక్‌కు ఆర్థిక పురోగతికి పాటుపడిన సుమారు 24 మందికి విజయవాడ రీజన్ జనరల్ మేనేజర్ పి.రవివర్మ శాలువాతో సత్కరించి బ్యాంక్ తరుపున జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ పి.రవివర్మ మాట్లాడుతూ కెనరా బ్యాంక్ ఆర్థిక ప్రగతిలో గోల్డ్ అప్రైజర్స్ దే కీలక పాత్ర అని అభివర్ణించారు. అనంతరం యూనియన్ జనరల్ బాడీ సభ్యులు జనరల్ మేనేజర్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహించి జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో సుమారు 550 మంది యూనియన్ నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో నూతన రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కయూనియన్ సభ్యులకు ఈదరాడ శ్రీనివాసరావు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇతర రాష్ట్రాలనుండి భాస్కరన్, రుద్రయ్య ఆచారి, దొరస్వామి, అశ్విన్, జయప్రకాశ్‌లు పాల్గొనగా జనరల్ బాడీ సభ్యులు కె.రంగాచారి, ఎస్.నాగలింగాచారి, ఎం.రమేష్‌బాబు. టి.ప్రభాకర్, టి. నరేంద్ర కుమార్, అయినంపూడి నాగపద్మ పాల్గొనగా బ్యాంక్ యూనియన్ అధికారులు వి.ఉదయ్‌కుమార్, ఎం.ఎన్.వి.ఎన్. శ్రీనివాస్‌కుమార్, జి.ఓబులేసు, కె.వి.రంగారావు, పడాల రమణ, వై.ఎస్.ప్రకాష్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

# యోగ శక్తి చికిత్స శిబిరం



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

పెనమలూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో అంతర్జాతీయ యోగా ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం యోగశక్తి చికిత్స శిబిరాన్ని స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం కిషోర్ బాబు ప్రారంభించారు.యోగ విధానాలు అందరికీ అనారోగ్యం బారిన పడకుండా ఉండటానికి ఉపయోగపడతాయని యోగ సాధన అందరికీ మంచిదని అన్నారు. క్యాంపు నిర్వహకుడు యోగశక్తి సాధన సమితి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ మాట్లాడుతూ రెండు చెవికొనల మధ్యన,తల మధ్యలో సహస్ర చక్రం చైతన్యవంతమై శారీరక మరియు మానసిక సమస్యలు తగ్గటమే కాకుండా 72 వేల నాడులు చైతన్యం చెంది ప్రాణ శక్తి పెంపొందించి ఆయుషు పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో పెనమలూరు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ రాజేష్ థెరపిస్టులు మాచూరి శ్రీరామ మూర్తి, అనగాని నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో ఆహ్లాదం.. ఆరోగ్యం..



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

మానసిక ఆహ్లాదంతో పాటు, శారీరక ఆరోగ్యానికి యోగా తోడ్పడుతుందని ఫెర్టికేర్ ఐవీఎఫ్ సెంటర్ ఆపరేషన్స్ ఏజీఎం అనూష ముదుండి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నగరంలోని ఫెర్టికేర్ నందు యోగా-జుంబా ఈవెంట్ నిర్వహించారు. ఉమెన్స్ డెంటల్ కౌన్సిల్, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కోస్టల్ ఏపీ బ్రాంచ్ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ యోగా, జుంబా వంటి వాటిని సాధన చేయాలన్నారు. మానసిక ఒత్తిడిని అధిగమించి జీవితంలో విజయం సాధించేందుకు యోగా, జుంబా చక్కగా ఉపయోగపడతాయని చెప్పారు. ఫెర్టికేర్ క్లినికల్ హెడ్ డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ, యోగా, జుంబా సాధన చేయడం ద్వారా గర్భిణీలకు సుఖ ప్రసవం జరుగుతుందని తెలిపారు. యోగా, జుంబాలను దైనందిన జీవనంలో భాగంగా మార్చుకోవడం ద్వారా ఆహ్లాదకరమైన, ఆరోగ్యదాయకమైన జీవనం గడపవచ్చని డాక్టర్ ప్రత్యూష సూచించారు. ఈ కార్యక్రమంలో ఐడీఎ కోస్టల్ ఏపీ ప్రెసిడెంట్ డాక్టర్ టి.గోవర్ధన్, సెక్రటరీ డాక్టర్ రామ్ సునీల్, డబ్ల్యూడీసీ కోస్టల్ ఏపీ ప్రతినిధి డాక్టర్ సీమ తదితరులు పాల్గొన్నారు.

# జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఎస్సీ విద్యార్థుల విజయకేతనం



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ఎస్సీ గురుకుల విద్యార్థులు కనబరిచిన ప్రతిభ కారణంగా ఐఐటీ, ఎన్ఐటీ, నిఫ్ట్, సెంట్రల్ యూనివర్సిటీల్లో ఈ ఏడాది 67 సీట్లు రానున్నాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున వెల్లడించారు. కరోనా కాలంలో పరీక్షలు రాయకుండానే పదోతరగతి పాసైన విద్యార్థుల బ్యాచ్‌తోనే ఈ ఫలితాలను సాధించగలిగామని తెలిపారు. జేఈఈ అడ్వాన్స్ డ్ ఫలితాల వెలువడిన నేపథ్యంలో సోమవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో అంబేద్కర్ గురుకులాల విద్యార్థులకు ఈ ఏడాది 67 సీట్లు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. గతేడాది జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉన్న కటాఫ్ మార్కుల ఆధారంగా చూసినప్పుడు ఈ ఏడాది ఐఐటీల్లో 16, ఎన్ఐటీలలో 39, నిఫ్ట్, ఇతర సెంట్రల్ యూనివర్సిటీల్లో 12 చొప్పున మొత్తం 67 సీట్లు వస్తాయని అంచనా వేస్తున్నామని తెలిపారు. చిన్నటేకూరు (కర్నూలు) శిక్షణా కేంద్రానికి చెందిన విద్యార్థుల్లో 28 మంది సీట్లు సాధించే అవకాశం ఉండగా వీరిలో 8 మంది ఐఐటీ, 16 మంది ఎన్ఐటీ, 4 ఇతర యూనివర్సిటీల్లో సీట్లు పొందే అవకాశం ఉందని చెప్పారు.ఈడ్పుగల్లు (కృష్ణా) శిక్షణా కేంద్రానికి చెందిన విద్యార్థుల్లో 29 మందికి సీట్లు వచ్చే అవకాశం ఉండగా వీరిలో 6 మంది ఐఐటీ, 17 మంది ఎన్ఐటీ, 6 మంది ఇతర యూనివర్సిటీల్లో సీట్లు పొందే అవకాశం ఉందన్నారు. అడవి తక్కెళ్లపాడు (గుంటూరు) శిక్షణా కేంద్రానికి చెందిన 10 మంది విద్యార్థులకు సీట్లు వచ్చే అవకాశం ఉండగా వీరిలో ఇద్దరు ఐఐటీ, 6 మంది ఎన్ఐటీ, మరో ఇద్దరు ఇతర యూనివర్సిటీల్లోనూ సీట్లు పొందే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని నాగార్జున వివరించారు. ప్రస్తుతం జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసిన విద్యార్థులు గతంలో కరోనా కాలంలో పరీక్షలు రాయకుండానే 9, 10 తరగతులు ఉత్తీర్ణులైన వారని వివరించారు. అయినప్పటికీ గతేడాది జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సాధించిన స్థాయిలోనే ఈ ఏడాది కూడా సీట్లను నిలుపుకోగలిగామన్నారు. అయితే వచ్చే ఏడాది ఈ పరీక్షల్లోనూ ఎస్సీ గురుకుల విద్యార్థులు అద్భుతాలను సృష్టిస్తారని ఆశాభావం వ్యక్తం చేసారు. ఇటీవల వెలువడిన నీట్ పరీక్షల్లోనూ ఎస్సీ గురుకుల విద్యార్థులు ఎంబీబీఎస్, డెంటల్‌లో 44 సీట్లను సాధించే దిశగా సత్తా చూపిన విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉత్తమ ఫలితాలను సాధించడానికి కృషి చేసిన గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శ ఆర్.పావనమూర్తి, ఏఎంఓ ఎన్.సంజీవరావు, ఇతర అధ్యాపకులను ఈ సందర్భంగా అభినందించారు.

# రాష్ట్రానికి రాజకీయ గ్రహణం పట్టింది : రామచంద్ర యాదవ్



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

ఏపీలో కొత్త రాజకీయ పార్టీ అవతరించబోతోందని పారిశ్రామిక వేత్త రామచంద్ర యాదవ్ ఒక ఫంక్షన్ హాల్లో ఆదివారం కీలక ప్రకటన చేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో మెజారిటీ ప్రజల కోరిక మేరకు కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భావం అవుతుందన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి రాజకీయ గ్రహణం పట్టిందని ఎవరు అధికారంలో వున్నా ఏదో ఒక వర్గం వెనుకబాటుకు గురవుతూనే ఉందన్నారు. రాష్ట్రంలో ఎవరు అధికారంలో వున్నా అన్ని వర్గాలకూ అన్యాయమే జరిగిందన్నారు. ఇందుకు ఏ పార్టీ, ఏ ప్రభుత్వం అతీతం కాదని, గత దశాబ్ద కాలాన్ని పరిశీలిస్తే రాష్ట్రంలోని రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు.

వ్యవసాయాన్ని వదిలి వలసలు వెళ్లే పరిస్థితి నెలకొందని, వ్యవసాయం పేరు చెప్పి అధికారంలో ఉన్నవాళ్లు దోపిడీ చేస్తున్నారన్నారు. రైతులకు ఎవ్వరూ మేలు చేసిన దాఖలాలు లేవన్నారు. నైపుణ్యం కలిగిన ఆంధ్ర యువత ప్రపంచ వ్యాప్తంగా ప్రతిభ చూపిస్తుంటే మన రాష్ట్రంలో మాత్రం ఉపాధి లేక అల్లాడే పరిస్థితి ప్రస్తుతం కనబడుతుందన్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యా అని దుయ్యబట్టారు. ఇప్పటి వరకు జరిగిన దోపిడీని కొత్త పార్టీ బట్టబయలు చేస్తోందని, వైసీపీ, టీడీపీ రాజకీయ పార్టీల నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విముక్తి కావాలన్నారు. ఆవిర్భావ సభ జూలై 23న నాగార్జున వర్సిటీలో ప్రజా సింహ గర్జన పేరుతో నిర్వహిస్తామని బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారన్నారు. టీడీపీపాలనలో కొన్ని కుటుంబాలు మాత్రమే అభివృద్ధి చెందాయని ఏ వర్గ అభ్యున్నతి కోసం ఆ పార్టీ పాటుపడలేదని విమర్శలు చేశారు. రౌడీ, హత్యా రాజకీయాలు ఫ్యాక్షన్ పార్టీ వైసీపీ అని, ఆ పార్టీ ఏర్పాటు, అది అధికారంలోకి రావడం దురదృష్టం అని మండిపడ్డారు. దశాబ్దాల రాజకీయ గ్రహణాన్ని వదిలించి, నవ శకాన్ని ఆవిష్కరించే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. వచ్చే నెల 23న నిర్వహించే ప్రజా సింహగర్జన పోస్టర్లను ఆవిష్కరించారు.

# నెల్లూరులో "లలితా జ్యూవెలరీ" 50వ షోరూం ప్రారంభం




**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

లలితా జ్యూవెలరీ మార్ట్ ప్రైవేట్ లిమిటెడ్ స్వర్ణ చరిత్రను లిఖించిందని ఆ సంస్థ అధినేత డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. నెల్లూర్‌లో 50వ షోరూం మైలు రాయికి చేరుకోనుందని..... 24వ తేదిన నెల్లూరు జిల్లాలో ఒకే రోజు మూడు షోరూమ్‌లను లాంఛనంగా ప్రారంభించనున్నామని వెల్లడించారు. నగరంలోనీ గురువారం ఒక ప్రముఖ హొటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో లలిత జ్యూవెలరీ మార్ట్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ . ఈ నెల 24వ తేదీన మూడు షోరూమ్‌లు సూళ్లూరుపేటలో 48, గూడూరులో 49, నెల్లూరులో 50వ బ్రాంచిలను ఒకే రోజు ప్రారంభిస్తున్నామన్నారు. ఈ షోరూమ్‌లు తన కుమార్తెలు భక్తి కిరణ్, భవ్య కిరణ్‌లు ప్రారంభిస్తారని వెల్లడించారు. సూళ్లూరుపేట, గూడూరు, నెల్లూరులో వైభవోపేతంగా ప్రారంభించ నున్నామని వెల్లడించారు. రాబోయే రోజుల్లో వందో షోరూం ప్రారంభించే విధంగా ముందుకు సాగుతమన్నారు. 150 షోరూమ్లు వరకు సౌత్ ఇండియాలోనే ప్రారంభిస్తామన్నారు. తను పుట్టిన గడ్డ మీద నెల్లూర్‌లో 50 వ షో రూం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. పాలిటిక్స్‌కి సినిమాలకు తాను దూరంగా ఉంటానన్నారు. తనకు లాభంపై ఆశ లేదని సామాన్యుల బంగారు ఆభరణాల కలను తీర్చే విధంగా హెూల్ సేల్ రిటైల్ అమ్మకాలు జరుపుతున్నామన్నారు.

# నగరంలో రామ్‌రాజ్ కాటన్ 250వ షోరూమ్ ప్రారంభం



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

నగరంలో రామ్‌రాజ్ కాటన్ 250వ షోరూంను ప్రముఖ నటుడు వెంకటేష్ దగ్గుబాటి ప్రారంభించారు. ఎన్టీఆర్ జిల్లా, పిన్నమనేని పాలిక్లీనిక్ రోడ్డులో ఏర్పాటుచేసిన ఈ షోరూంను ఆదివారం నటుడు వెంకటేష్ దగ్గుబాటి ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ కాటన్ దుస్తులు ధరిస్తే శరీరానికి హాయిగా ఉండటమే కాకుండా పర్యావరణాన్ని పరిరక్షించినట్లు అవుతోందన్నారు. నెల్లూరులో 100వ షోరూంను కూడా తానే ప్రారంభించానని, భవిష్యత్తులో 1000వ షోరూంను కూడా తానే ప్రారంభించాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. రామ్‌రాజ్ కాటన్ దుస్తులు వ్యక్తిలోని సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయన్నారు. విజయవాడలో ఇది మూడోదని, ఆంధ్రాలో అతి పెద్ద షోరూమ్ అని వివరించారు. రామ్‌రాజ్ కాటన్ సంస్థ చైర్మన్ కే.ఆర్.నాగరాజన్ మాట్లాడుతూ ధోతీలు, షర్ట్‌లు, ఇన్నర్‌వేర్లు, నైట్వేర్, ఫ్యాబ్రిక్స్, కిడ్స్ అండ్ ఉమెన్స్ వేర్లతో పాటుగా అన్ని రకాల శుభకార్యాలకు అవసరమైన వస్త్రాలు తమ షోరూంలో అందుబాటులో ఉంటాయన్నారు. రూ.500 నుంచి రూ.లక్ష వరకు విలువ చేసే 2500 రకాల పంచెలు తమ షోరూముల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. హీరో వెంకటేశ్ తమ సంస్థ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండటం చాలా సంతోషంగా ఉందని, బిజీ షెడ్యూల్ ఉన్నా ఆయన షోరూం ప్రారంభించడానికి అమెరికా నుంచి వచ్చారన్నారు. 4 దశాబ్దాల పయనంలో చేనేత కార్మికులను కుటుంబ సభ్యుల్లా చూసుకుంటున్నామని, సుమారు 50,000 మంది రామ్‌రాజ్ కాటన్ కోసం పనిచేస్తున్నారని నాగరాజన్ తెలిపారు. దేశవ్యాప్తంగా తమ ఉత్పత్తులను ప్రజలకు చేరువ చేస్తున్నామన్నారు.

## ప్రపంచ ఆరోగ్యం ఆనందం యోగాతోనే సాధ్యం



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

అంతర్జాతీయ యోగా ఉత్సవాలలో భాగంగా ఈరోజు విజయవాడ ఆయుర్వేద కాలేజి ఆవరణలో జరిగిన యోగాశక్తి చికిత్స మరియు హెల్త్ క్యాంప్‌లో పాల్గొన్న యోగా శక్తి సాధన సమితి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ రేపటి ప్రపంచ ఆరోగ్యంగా ఆనందంగా వుండాలంటే యోగ సాధనతోనే సాధ్యమన్నారు. యోగ,ఆయుర్వేదం భారతదేశము యొక్క అతి పురాతన వైద్య విధానాలని,వీటిని అనేక క్లిష్ట పరిస్థితుల నుండి ఉపయోగించి విజయం సాధించారని. వీటిని అన్నిదేశాలు అవలంబించడంలో సర్వ మానవాళి రుగ్మతల బారిన పడకుండా ఉపయోగపడతాయని తెలిపారు. యోగాకి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన భారత ప్రధాని నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమము ఆయుర్వేద కాలేజీ విద్యార్థులు స్టాఫ్ పాల్గొని సద్వినియోగం చేసుకున్నారు. విజయవాడ ఆయుర్వేద కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సాయి సుధాకర్ జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించినారు. ప్రతి ఒక్క విద్యార్థి ఆయుర్వేదంతో పాటు యోగ కూడా అలవరుచుకుని ప్రజలను చైతన్యం చేయవలసిందిగా కోరారు. యోగా గురువు జి.కృష్ణ యోగాసనాల విశిష్టతను తెలిపి ప్రాక్టీస్ చేయించారు. ఆయుర్వేద కాలేజీ యాజమాన్యం ఈ సందర్భంగా డాక్టర్ మాకాల సత్యనారాయణని, యోగా గురువు జి.కృష్ణని సన్మానించారు. చైతన్య వందన సమర్పణ చేసినారు. పలువురికి హెల్త్ కప్ చేసి యోగా రికమెండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రములో మాచూరి శ్రీరామ్‌మూర్తి, బాడపాటి ఉదయ్‌కుమార్ సేవలు అందించినారు.

## "జులై 1వ తేదీ నుండి రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్‌శాఖ రాష్ట్ర కార్యాలయం తాడేపల్లి నుండి సేవలు"

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

రిజిస్ట్రేషన్స్ మరియు స్టాంప్స్ శాఖ కమీషనర్ అండ్ ఇన్స్‌పెక్టర్ జనరల్ వారి కార్యాలయాన్ని గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వి.స్క్వేర్ బిల్డింగ్‌లోకి మారుస్తున్నామని కమీషనర్ వి.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతవరకూ ఎన్‌టిఆర్ జిల్లా ఈడ్పుగల్లులోని ఆర్.కె. స్ప్రింగ్ వ్యాలీ అపార్ట్‌మెంట్‌లో ఉన్న రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖ రాష్ట్ర కార్యాలయం జులై 1వ తేదీన గుంటూరు జిల్లా తాడేపల్లిలోని కెఎస్‌ఆర్ పార్క్ రోడ్డు, వార్డు నెం.2, వి స్క్వేర్ బిల్డింగ్‌లోకి కార్యాలయాన్ని మార్పు చేస్తున్నామని ప్రజలు వారి పనులు నిమిత్తం ఈ కార్యాలయమునకు వచ్చే వారు ఈ మార్పును గమనించగలరని రిజిస్ట్రేషన్స్ మరియు స్టాంప్స్ శాఖ కమీషనర్ వి.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

# దేశంలో మండిపోతున్న ఎండలు.. 11 సంవత్సరాల రికార్డు బద్దలు




**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

జూన్ రెండో వారం ముగిసినప్పటికి దేశంలో చాలా చోట్ల రుతుపవనాల జాడలేదు. మే నెలల్లో కొట్టాల్సిన ఎండలు ఇప్పుడు దంచికొడుతున్నాయి. యూపీ, బీహార్‌లో మూడు రోజుల్లో ఎండల తీవ్రతకు 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. బీహార్‌లో రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దేశంలో మండిపోతున్నాయి ఎండలు జూన్ నెల సగం గడిచిపోయినా ఎండల తీవ్రత ఏమాత్రం తగ్గడం లేదు. ఎండలకు తోడు వేడిగాలులు వీస్తున్నాయి. రాబోయే రోజుల్లో పది రాష్ట్రాల్లో వేడిగాలులు వీస్తాయని భారత వాతావరణశాఖ హెచ్చరించింది. ఉత్తరప్రదేశ్, బీహార్, తమిళనాడు, మధ్యప్రదేశ్, జార్ఖండ్, మహారాష్ట్రలోని విదర్భ, ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రాగల మూడు రోజులు వేడిగాలుల తీవ్రత పెరుగుతుందని హెచ్చరించింది. వడగాల్పుల కారణంగా బీహార్‌లో 7 జిల్లాల్లో రెడ్ అలెర్ట్ ప్రకటించారు. బీహార్, ఉత్తరప్రదేశ్‌లో చాలా ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. యూపీలోని బలియాలో 72 గంటల్లో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో ఎండల తీవ్రతకు చాలామంది అనారోగ్యం పాలవుతున్నారు. గడిచిన మూడు రోజులలోనే యూపీ, బీహార్‌లో వంద మంది చనిపోయారు. మృతుల్లో లో 60 ఏళు పైబడిన వారే ఎక్కువని అధికారులు వెల్లడించారు. బీహార్‌లో 45 మంది, యూపీలో 55 మంది ఎండల తీవ్రతకు చనిపోయారు. వడగాలులకు డీహైడ్రేషన్, జ్వరం, డయేరియా తదితర అనారోగ్య సమస్యలతో ఆసుపత్రులకు జనం క్యూ కడుతున్నారు. ఎండల తీవ్రత కారణంగా బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. సాధారణ అనారోగ్యాలతో పాటు గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది.

**11 సంవత్సరాల రికార్డు బద్దలు..**

ఎండలు తగ్గకపోవడంతో పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వేసవి సెలవులు పెంచుతున్నట్లు బీహార్ ప్రభుత్వం ప్రకటించింది. బీహార్ ఈ నెల 24 వరకు స్కూళ్లకు సెలవులు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. విదర్భలోని కొన్ని ప్రాంతాల్లో చాలా వేడి గాలులు వీస్తాయని, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్‌లో వచ్చే మూడు రోజులు వేడి మరింత ఎక్కువగా ఉంటుందని వాతావరణశాఖ పేర్కొంది. ఉత్తరప్రదేశ్, బీహార్, తూర్పు మధ్యప్రదేశ్‌లో రాబోయే రెండు రోజుల పాటు వేడిగాలులు వీస్తాయని తెలిపింది. తెలంగాణ, తమిళనాడు, పశ్చిమ మధ్యప్రదేశ్‌లలో రానున్న 24 గంటలపాటు వేడిగాలులు వీస్తాయని పేర్కొంది. మరో వైపు బీహార్‌లో హీట్‌వేవ్ గత 11 సంవత్సరాల రికార్డును బద్దలు కొట్టింది. అంతకుముందు 2012లో 19 రోజుల పాటు నిరంతరంగా వేడిగాలులు వీచాయి. ఈ సారి 20 రోజులుగా వేడిగాలులు వీస్తున్నాయి. తీవ్ర ఎండల కారణంగా గోవా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్‌లోనూ ఎండవేడిని దృష్టిలో ఉంచుకొని సెలవులను పొడిగించారు. . పశ్చిమ, ఆగ్నేయ ప్రాంతాల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వివరించింది. ఈశాన్య రాజస్థాన్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. సోమ, మంగళవారాల్లో పశ్చిమ మధ్యప్రదేశ్, నైరుతి ఉత్తరప్రదేశ్‌లో వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. రాబోయే రోజుల్లో ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాలుంటాయని వాతావరణశాఖ హెచ్చరించింది.

## ఆహార భద్రతకు బలమైన నిబద్ధత గ్రోవెరో టెక్నాలజీస్



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

సుస్థిర వ్యవసాయ పద్ధతులు మరియు ఆహార భద్రతకు బలమైన నిబద్ధతతో గ్రోవెరో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కొత్త వ్యవసాయ సాంకేతిక సంస్థను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఛానెల్ భాగస్వాముల సమక్షంలో శుక్రవారం నోవాటెల్ హొటల్, విజయవాడలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఫౌండర్ & డైరెక్టర్ పిజె శ్రీకాంత్, సంస్థ సిఇఒ వేముల సురేష్, నేషనల్ సేల్స్ హెడ్ భాస్కర్ పున్నా, బిజినెస్ హెడ్ వైఎన్‌వి ఉమాకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఫౌండర్ & డైరెక్టర్ పిజె శ్రీకాంత్ మాట్లాడుతూ గ్రోవెరో టెక్నాలజీస్ రైతులు పంటలను పండించే విధానాన్ని విప్లవాత్మకంగా మార్చడం మరియు ఉత్పాదకతను పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది. గ్రోవెరో టెక్నాలజీస్ వ్యవసాయం, డేటా ఆనలిటిక్స్ మరియు టెక్నాలజీలో నిపుణుల బృందంతో వినూత్న పరిష్కారాల ద్వారా రైతులను బలోపేతం చేయడంపై దృష్టి పెడుతుంది. లాంచ్ ఈవెంట్లో సిఈఓ వేముల సురేష్ మాట్లాడుతూ గ్రోవెరో టెక్నాలజీస్ దాని వినూత్న పరిష్కారాలతో రియల్ టైమ్ డేటా మరియు అంతర్దృష్టులతో రైతులను శక్తివంతం చేయడానికి రూపొందిచబడింది. తద్వారా వారు అధిక దిగుబడిని సాధించడానికి, ఖర్చులను తగ్గించడానికి మరియు ప్రపంచానికి దోహదపడతారు. ఆహార భద్రత మేము ఈ ప్రయాణాన్ని ప్రారంభించేందుకు మరియు వ్యవసాయ భూభాగంలో సానుకూల మార్పు తీసుకురావడానికి సంతోషిస్తున్నాము. నేషనల్ సేల్స్ హెడ్ పి.భాస్కర్ మాట్లాడుతూ గ్రోవెరో వద్ద మేము సాంకేతికత, వ్యయ పోటీతత్వం మరియు కస్టమర్ సేవల యొక్క ప్రధాన విలువలతో కంపెనీని నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. అది జరగాలంటే 1000 ఛానల్ భాగస్వాములు & స్టాకెస్ట్ పాయింట్స్ యొక్క బలమైన నెట్‌వర్క్‌ని ఏర్పాటు చేయడం ద్వారా వ్యవసాయ కమ్యూనిటీకి నిజ సమయంలో & నమ్మదగిన పరిష్కారాలను అందించడానికి మాకు వీలు కల్పిస్తుంది అని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సురేష్ వేముల తెలిపారు. బిజినెస్ హెడ్ వైఎన్‌వి ఉమాకుమార్ మాట్లాడుతూ గ్రోవెరోకు పంట వైవిధ్యీకరణ వ్యూహం మరియు విత్తనానికి హార్వెస్ట్ సొల్యూషన్స్ ఉన్నాయి. ఇవి 140+ పంట రక్షణ రసాయనాల రిజిస్ట్రేషన్లను పొందాయి, వీటిలో పురుగు మందులు, శిలీంధ్ర సంహారిణి, హెర్బిసైడ్, పిజిఆర్ మరియు బయో స్టీమ్యులెంట్లు ఉన్నాయి. మేము పంటలు మరియు విభాగాలలో సేవలను అందిస్తున్నాము. తెలంగాణ పంటల సంరక్షణ పరిశ్రమకు హాజరైన క్లాస్ ఎ ఛానెల్ భాగస్వాములందరూ రైతు సమాజంలో సంతోషాన్ని తీసుకురావడానికి కృషి చేస్తున్న సమూహం యొక్క ప్రయత్నాలను ప్రశంసించారు.

## ఈనెల 24 వరకు ఒంటిపూట బడులు పొడిగింపు

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

రాష్ట్రమంతా వేసవితాపం దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడకూడదని మరోవారం రోజుల పాటు ఒంటిపూట బడులు కొనసాగించాలని పాఠశాల విద్యాశాఖ కమీషనర్ ఎస్.సురేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీ వరకు అన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాల యాజమాన్యాలు యథా తథంగా పాఠశాల బోధనా సమయం: ఉదయం 7:30 నుండి 11:30 వరకు. రాగి జావ: ఉదయం 8:30 నుండి 9:00 వరకు. మధ్యాహ్న భోజనం: మధ్యాహ్నం 11:30 నుండి 12:00 వరకు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమీషనర్ ఎస్.సురేష్ కుమార్ ఆదేశించారు.

## కేజీబీవిలలో అదనపు సీట్లు మంజూరు కోసం కేంద్ర విద్యా శాఖ మంత్రిని కోరిన కేసలి



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములోని కేజీబీవి పాటశాలలో విద్యను అభ్యసించడానికి అనేక మంది నిరుపేద బాలికలు ఆసక్తి చూపిస్తున్నారని కానీ వారికి సరిపడా సీట్లు అందుబాటులో లేవని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ని కోరారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల కాలంలో ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యకు ప్రాధాన్యత ఇస్తూ విద్యా కోసము ప్రవేశపెట్టిన అనేకమైన సంక్షేమ పథకాలు నేపథ్యం లో బాలికలు అందరూ చదువు బాటపట్టారు. ఈ నేపధ్యంలో అనేకమంది నిరుపేద కుటుంబంలో 6-10 వ తరగతి వరకు చదువును అభ్యసిస్తున్న బాలికలు కు కేజీబీవి పాటశాలల్లో అవకాశం పొందలేక నిరాశ నిస్పృహలకు గురవుతూ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ను ఆశ్రిహిస్తు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు ఈ సంవత్సరం కూడా మంచి మార్కులు ఫలితాలు సాధించారు.

కావున బాలికలు కేజీబీవీ లో ఉన్నత చదువులు కోసం దృఢ సంకల్పంతో తీవ్రంగా ప్రయత్నాలు చేస్తూ అనేకమంది నిరుపేద కుటుంబ సభ్యులు,బాలలు కోసము పనిచేసే సంస్థలు, సంఘాలు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బాలల హక్కుల కమిషన్ దృష్టికి తీసుకొని వస్తున్నారు .వీటిని దృష్టిలో పెట్టుకొని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కి మరియు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి కూడా వివరించడం జరిగింది.

# సౌందర్య సంరక్షణ ఉత్పత్తుల్లో 'మెల్లో హెర్బల్స్' హవా

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

సౌందర్య సంరక్షణ ఉత్పత్తుల్లో దేశీయ 'ఆయుర్వేద హబ్'గా పేరుగాంచిన మెలో హెర్బల్స్ ఉత్పత్తులు దక్షిణ భారతదేశంలో అత్యంత వేగంగా ప్రజాదరణ పొందుతున్నాయి. ఈ ఏడాదిలో గత కొన్ని నెలలుగా దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో మెలో హెర్బల్స్ ఉత్పత్తుల విక్రయాలు గణనీయంగా పెరుగుతూ వస్తున్నాయి. నాణ్యతకు పేరుగాంచిన మెల్లో సౌందర్య సంరక్షణ ఉత్పత్తుల్లో 'ఫ్లాగ్ షిప్'గా లిప్ ట్రీట్‌మెంట్ ప్రొడక్ట్ నిలవడం విశేషం. అంతే కాకుండా దక్షిణ భారతదేశం నుంచి ఉత్పత్తి అవుతున్న మెల్లో ఉత్పత్తులన్నింటిలో అత్యధికంగా సౌందర్య ప్రియులను ఆకర్షిస్తున్న పెదవుల సంరక్షణ కోసం వినియోగించే లిప్ ట్రీట్‌మెంట్ అగ్రభాగాన నిలిచి, మొత్తం బ్రాండ్ ఆదాయంలో 90 శాతం ఆదాయాన్ని సమకూరుస్తోంది.

మెల్లో అనేది ప్రముఖ పాన్- ఇండియా పర్సనల్ కేర్ బ్రాండ్, ఇది వినియోగదారులకు ఉత్తమమైన ఆయుర్వేద ఉత్పత్తులను అందించి, వారి సౌందర్యాన్ని ద్విగుణీకృతం చేస్తుంది. ఆధునిక కాలానికి అనుగుణంగా, పురాతన ఆయుర్వేద జ్ఞానాన్ని, సాంకేతికతను మిళితం చేసి తన ఉత్పత్తులను రూపొందిస్తుంది. మెల్లో ఉత్పత్తుల్లో అగ్రభాగాన నిలిచిన లిప్ ట్రీట్‌మెంట్.. బాదం నూనె, టంకనామల్, జసదా భస్మం వంటి ఆయుర్వేద ముడి పదార్థాల గుణాలతో రూపొందించినది. బాహ్య వాతావరణం ఎలా ఉన్నా, అన్ని కాలాలలో పెదవులు పగిలినా, పొడిబారినా వాటిని నయం చేసి ఎక్కువసేపు మెరిసేలా, ఆకర్షణీయంగా మారుస్తుంది. అంతేకాకుండా పెదవులను మృదువుగా మారేలా పోషణనందించి తాజా అనుభూతిని అందించడంలోనూ సహాయపడుతుంది. స్త్రీ, పురుషులెవరైనా ఉపయోగించగలిగేలా రూపొందించిన ఈ మెల్లో లిప్ ట్రీట్‌మెంట్ ఉత్పత్తిలోని సుగుణాలు, మెరిసే రూపం, ఎటువంటి పళ్ల రుచినీ(మార్కెట్లోని పోటీ ఉత్పత్తుల తరహాలో కాకుండా) కలిగి ఉండకపోవడం యువతను అమితంగా ఆకట్టుకుంటోంది. దక్షిణాది రాష్ట్రాల్లో పలు టైర్ 2, టైర్ 3 పట్టణాల్లోని యువత ఎక్కువగా కోరుకునే ఉత్పత్తిగా మారింది. లిప్ ట్రీట్‌మెంట్‌తో పాటు, మెల్లో క్రాక్ హీల్ క్రీమ్, కుంకుమాది తైలం తదితర ఇతర ఉత్పత్తులు కూడా దక్షిణ భారతదేశం అంతటా విస్తృత ప్రజాదరణ పొందుతున్నాయి. ఈ సందర్భంగా మెల్లో హెర్బల్స్ వ్యవస్థాపకులు, సీఈవో వైశాలి శారద మాట్లాడుతూ, "ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లోని పలు నగరాలు, పట్టణాలు మెల్లో వ్యాపార వృద్ధికి కేంద్రంగా మారడం హర్షణీయమని పేర్కొన్నారు. ప్రత్యేకించి, మెల్లో లిప్ ట్రీట్‌మెంట్ ఆయా ప్రాంతాల్లోని సౌందర్య ప్రియులను విస్తృతంగా ఆకర్షిస్తోంది. ఈ డిమాండ్ దృష్ట్యా నైకా, ఫ్లిప్ కార్ట్, అమెజాన్, మెల్లో సొంత వెబ్‌సైట్ సహా పలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలోనూ తమకు భారీగా ఆర్డర్‌లు పెరిగాయని వివరించారు.

ఆయుర్వేదం పుట్టిన మన దేశంలో ఆయుర్వేద మూలికలతో తయారవుతున్న మెల్లో హెర్బల్స్ దక్షిణ భారత మార్కెట్లో పెరుగుతున్న డిమాండ్‌తో ప్రధాన వాటాదారుగా ఉద్భవించడం గమనార్హం. ఈ ప్రజాదరణ దృష్ట్యా మెల్లో ఉత్పత్తులను దక్షిణ భారతదేశంలోని ప్రతి ప్రాంతానికీ చేర్చేందుకు, ఉత్పత్తులు, బ్రాండ్‌పై మరింత అవగాహన పెంచేందుకు విస్తరణ కార్యక్రమాలు చేపట్టనుంది. అందుకోసం, కంపెనీ తమ ఉత్పత్తులను అన్ని ఆయుర్వేద స్పాలు, మాల్స్, ఇతర వాణిజ్య సముదాయాలతో పాటు దక్షిణ భారతంలోని ఎంపిక చేసిన బోటిక్ ఆర్గానిక్ స్టోర్‌లలో అందుబాటులో ఉంచాలని యోచిస్తోంది. అంతే కాకుండా మెల్లో భవిష్యత్తు ప్రణాళికలలో భాగంగా కార్పొరేట్ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోవడం, ఇప్పటికే మెల్లో ఉత్పత్తులను ఆదరిస్తున్న అమెరికా సంయుక్త రాష్ట్రాలు, దుబాయ్ తదితర దేశాల్లోనూ విస్తృతంగా అందుబాటులోకి తెచ్చి, అంతర్జాతీయ మార్కెట్‌లలోకి ప్రవేశించడం వంటి లక్ష్యాలు నిర్దేశించుకుంది.

## వారాహి దేవి అమ్మవారి పూజా విధానం



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
ఎన్ని పూజలు పరిహారాలు చేసిన మీ కోరిక తీరడం లేదు అనుకునేవారు 3 అక్షరాల బీజ మంత్రాన్ని అనుకోని చూడండి పది నిమిషాల్లో తీరుతుంది లక్ష్మీ స్వరూపమైన వారాహి దేవి పై నమ్మకం ఉంచి మంత్రాన్ని జపించాలి. ఐమ్ క్లీమ్ సౌ అనే మంత్రాన్ని 11 సార్లు, 21సార్లు.. ఎన్నిసార్లైనా జపించవచ్చు ఇలా చేయడం వల్ల మీ సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. ఏదో ఒక రూపంలో మీ సమస్య తొలిగిపోతుంది. వారాహి అమ్మవారికి పూజ సాయంత్రం ఆరు నుంచి తొమ్మిది లోపు చేయాలి. పూజ కోసం అమ్మవారి చిత్ర పటం, కాస్త గంధం, తెలుగు రంగు పూలు, సాంబ్రాణి దూపం ఉండాలి. అయితే సాంబ్రాణి బొగ్గులు వెలిగించి దానిపై సాంబ్రాణి దూపం వేయండి. అగరబత్తులు వెలిగించకూడదు. అమ్మవారికి మహాదీపంతో పాటు చిన్న దీపం కూడా వెలిగించండి. నైవేద్యంగా నల్లబెల్లం రెండు లవంగాలు ఉపయోగించండి. సింధూరం కలిపిన అక్షింతలు వేస్తూ.. అమ్మవారి చిత్రపటానికి పూజ చేయాలి. అమ్మవారికి శుక్రవారం అష్టమి తిథి కలిసి వచ్చిన రోజు 6గంటల నుంచి 10 గంటలు లోపు దీపం, ధూపం నైవేద్యం భక్తిశ్రద్ధలతో అమ్మవారి పూజ చేసుకొని 3 లవంగాలు అరచేతిలో తీసుకొని ఈ మంత్రాన్ని 26 సార్లు అనుకోండి. మీరు ఏమి కోరుకుంటే వెంటనే తీరుతుంది. నర దిష్టి, చెడు దిష్టి, ఎదుటివారి శాపం వంటి తగలకుండా ఉండేందుకు శుక్రవారం రోజు అష్టమి తిథి పంచమి నాడు అమ్మవారిని పూజించాలి. ఈ రోజు అమ్మవారికి చాలా ఇష్టమైన రోజు.. శుక్ర గోరల్లో ఈ పరిహారం చేస్తే కష్టం అనే మాటకు చోటు ఉండదు.

## ఇండో అరబ్ ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు స్వీకరించిన ఎంపీ భరత్



**రాజమండ్రి, నేటి పత్రిక ప్రజావార్త :**
ఇండో అరబ్ ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్ స్వీకరించారు. దుబాయ్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ జీ20 ప్రెసిడెన్సీ సెలబ్రేషన్స్ ఆఫ్ ఇండియా ఇండో అరబ్ ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు-2023 తో ఎంపీ భరత్‌ను సత్కరించారు. పర్యావరణ పరిరక్షణ, హరిత విప్లవం దిశగా ఎంపీ భరత్ రాజమండ్రిలో గత నాలుగు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డు వరించింది. యువతా హరితా, గో గ్రీన్ ఛాలెంజ్ పేరుతో యువతను, విద్యార్థులకు మొక్కల పెంపకంపై ఆసక్తితో పాటు ఒక బాధ్యతగా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములయ్యేందుకు ఎంపీ భరత్ చేసిన, చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ఈ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ప్రశంసించింది. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ జీ20 'వసుధైక కుటుంబం'-2023 థీమ్‌గా తీసుకుందని ఎంపీ భరత్ తెలిపారు. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఇండో అరబ్ ఇంటర్నేషనల్ ఎక్సెలెన్స్ అవార్డు రావడం పట్ల ఎంపీ భరత్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ అవార్డు రావడానికి రాజమండ్రి నగరంలోని విద్యార్థినీ విద్యార్థులు, ఆయా విద్యా సంస్థల యాజమాన్యాలు, యువత ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. వారందరికీ ఈ అవార్డు అంకితం చేస్తున్నానని ఎంపీ భరత్, మున్సిపల్ కార్పొరేషన్ ఎంతో దీక్షగా మొక్కలు నాటే కార్యక్రమంలో తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు.

## ఈనెల 19 నుంచి వర్షాలు : వాతావరణశాఖ ప్రకటన

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :
ఈనెల 19 నుంచి వర్షాలు ఉన్నట్లు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ నెల 18 నుంచి 21 మధ్య ఋతుపవనాలు విస్తరించేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈనెల 19 నుంచి తిరుపతి, శ్రీ సత్యసాయి, అన్నమయ్య, తిరుపతి, వైయస్సార్, చిత్తూరు జిల్లాలో చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురుస్తాయని, అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కోస్తాంధ్రలో కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంది. ఇక అటు తెలంగాణ రాష్ట్రంలో కూడా ఈ నెల 19 నుంచి వర్షాలు ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది.

# తనదైన శైలిలో వినూత్న ఒరవడికి శ్రీకారం చుట్టిన ముప్పవరపు వెంకయ్యనాయుడు




**విశాఖపట్నం, నేటి పత్రిక ప్రజావార్త :**
భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తనదైన శైలిలో వినూత్న ఒరవడికి శ్రీకారం చుట్టారు. వారి 75వ జన్మదినోత్సవ సందర్భంలో... 50 ఏళ్ళ ప్రజా జీవన ప్రస్థానాన్ని పురస్కరించుకుని, గతంలో వారి దగ్గర వివిధ హోదాల్లో సేవలు అందించిన సహచర బృందంతో ప్రత్యేక ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. అటెండర్ నుంచి ఐ. ఏ.ఎస్ అధికారి వరకూ ప్రతి ఒక్కరినీ సత్కరించారు. విశాఖపట్నంలోని ఏ-1 కన్వెన్షన్ హాల్ లో జరిగిన ఈ సమావేశానికి గతంలో వారి దగ్గర పని చేసిన వ్యక్తిగత సహాయకులు మొదలుకుని, ప్రభుత్వ ఉన్నతాధికారుల వరకూ పాల్గొన్నారు. ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరించి, పరిచయం చేసిన ముప్పవరపు వెంకయ్యనాయడు, ప్రతి ఒక్కరినీ ప్రత్యేకంగా అభినందించారు.

ఈ సందర్భంగా ముప్పవరపు వెంకయ్యనాయుడు మాట్లాడుతూ... 50 ఏళ్ళ నుంచి తమ సతీమణి ఉషమ్మ సహకారంతో పాటు... వివిధ హోదాల్లో తనతో కలిసిన పనిచేసిన సిబ్బంది సహకారం, అంకితభావమే తన విజయాలకు కారణమని ఆయన పేర్కొనటం విశేషం. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, రాజకీయ నాయకులు, వివిధ వృత్తుల్లో స్థిరపడిన ఎవరైనా సేవాభావంతో జీవితంలో ముందుకు సాగాలని వారు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన తమ పూర్వ సిబ్బందికి అష్ట గుణాలను ఉద్బోధించారు. సమయపాలన, క్రమశిక్షణ, బృందస్ఫూర్తి, సేవాభావం, అంకితభావం, పరిపూర్ణ దృష్టి, నీతి, రీతి లాంటి ఎనిమిది గుణాలు జీవితంలో ఉన్నతిని అందిస్తాయని పేర్కొన్నారు. జీవితం మనల్ని ఏ మార్గంలో ముందుకు తీసుకుపోయినా సేవా భావాన్ని మాత్రం మరువకూడదని సూచించారు. ఈ సందర్భంగా వారందరికీ భారతీయ సంప్రదాయం ప్రకారం దుస్తులు పెట్టి, ఆశీర్వచనం అందించారు. అనంతరం తెలుగువారి సంప్రదాయ వంటకాలతో వారికి ప్రత్యేక విందును ఏర్పాటు చేసి, అందరినీ పేరుపేరునా, ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా వారి మనుమడు, మనుమరాళ్ళు కలిసి వెంకయ్యనాయుడు జీవిత విశేషాలతో రూపకల్పన చేసిన యాప్, మరియు వెబ్‌సైట్‌ను ఆవిష్కరించి, పరిచయం చేశారు. అంతకు ముందు కార్యక్రమంలో భాగంగా, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... వెంకయ్యనాయుడు ప్రియశిష్యునిగా సాగించిన సమయాన్ని గుర్తు చేసుకున్నారు. వెంకయ్యనాయుడు దగ్గర పని చేస్తే, జీవితంలో ఏదైనా సాధించవచ్చని, ఆయన తర్ఫీదు అలా ఉంటుందని కొనియాడారు. తమ పిల్లలతో సమానంగా వెంకయ్యనాయుడు, వారి సతీమణి ఉషమ్మ అందించిన పుత్రవాత్సల్యం మరువలేనిదని, తనకు ఆరోగ్యం బాగాలేని సందర్భంలో వారు అండగా ఉన్న తీరును గుర్తు చేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. జీవితంలో 75 ఏళ్ళు పూర్తిచేసుకున్న అమృతోత్సవ సందర్భంలో గుర్తు పెట్టుకుని మరీ వెంకయ్యనాయుడు వ్యక్తిగత సిబ్బంది మొదలుకుని, ఉన్నత అధికారుల వరకూ అందరినీ పిలిచి, కుటుంబ సభ్యుల్లా ఆదరించి అభినందించటం పట్ల వారి వద్ద గతంలో పని చేసిన సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. వారి ప్రేరణతో సేవా భావాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, భారతీయ జనతాపార్టీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్, ఐ.ఏ.ఎస్ అధికారులు ఐ.విసుబ్బారావు, రజత్ భార్గవ్, కృష్ణకిశోర్, సురేష్, యువరాజ్, ప్రశాంత్ కుమార్ రెడ్డి, రాజ్యసభలో సేవలు అందించిన రామాచార్యులు, ఏ.ఏ.రావు సహా... పలువురు ప్రభుత్వ అధికారులు, వెంకయ్యనాయుడు పూర్వ వ్యక్తిగత సిబ్బంది, ప్రస్తుత వ్యక్తిగత సిబ్బంది, నాయుడు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అంతరిక్ష పరిశోధన రంగాల్లో వేగంగా అభివృద్ధి



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
అంతరిక్ష పరిశోధన, సంబంధిత శాస్త్ర రంగాలు వేగంగా అవృద్ధి చెందుతున్నాయని ఉషారామ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకేఎస్వీ ప్రసాద్ అన్నారు. నగరంలోని మేనర్ ఫుడ్ ప్లాజాలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అంతరిక్ష పరిశోధనరంగాల్లో మంచి భవిష్యత్తు ఉన్నందున, విద్యార్థులు రాణించేందుకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యతలతో వారిని సన్నద్ధం చేయడం మన బాధ్యత అని వెల్లడించారు. స్పేస్ కిడ్జ్ ఇండియా సహకారంతో ఉషారామ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 25వ తేదీ ఆదివారం అంతరిక్ష, అంతరిక్ష అన్వేషణపై అవగాహన కల్పించేందుకు. అధిక ఎత్తులో ఉండే బెలూన్‌ను సిద్దం చేశామని తెలిపారు. చిన్న ఉపగ్రహాలు, స్పేస్ క్రాఫ్ట్‌లు, గ్రౌండ్ సిస్టమ్ రూపకల్పనలో స్పేస్ కిడ్జ్ భారతదేశంలోనే అగ్రగామిగా ఉందని చెప్పారు. విద్య పరిశోధన, పరిశ్రమల అవసరాలను తీర్చడానికి అంతరిక్షంలో ఆర్థిక, స్థిరమైన లక్ష్యాలను సాధించడం వారి లక్ష్యమని అన్నారు. అంతరిక్షాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి, పొదుపు చేయడంలో భాగంగా హై అల్టిట్యూడ్ బెలూన్‌ను, నానో ఉండే ఉపగ్రహాల ద్వారా విద్యార్థులకు ప్రయోగాత్మక అనుభవాన్ని అందిస్తూ, అంతరిక్ష విద్యను ప్రోత్సహించడానికి ఈ ప్రయోగం ఉపయోగపడుతుందని వివరించారు. 25 మంది విద్యార్థులతో కూడిన బృందంస్పేస్ సైన్సెస్, టెక్నాలజీ, నానో రీటిలైట్, ఎంబెడెడ్ సిస్టమ్ గురించి శిక్షణ పొందారని తెలిపారు. ఈ ఉషారామ శాట్ మిషన్‌కు డైరెక్టర్‌గా అక్షయ్ విద్యార్థి బృందానికి నాయకత్వం వహిస్తున్నారని ప్రకటించారు. ఈ బెలూన్ ప్రారంభించడం వల్ల స్దానిక సమాజంలో ఆసక్తి, ఉత్సాహం ఏర్పడుతుందని, ఇది సానుకూల ప్రభావావాన్ని సృష్టిస్తుందని ఆశాభావం వెలిబుచ్చారు. శాస్త్రీయ ఆవిష్కరణలకు కేంద్రంగా ఉషారామ కీర్తించబడుతుందని డాక్టర్ ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఉషారామ బృందాన్ని కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం అభినందించారు. ఈ సమావేశంలో కళాశాల చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కె.యజ్ఞసాయి, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ రిఫత్ షారూక్, ఉషారామ బెలూన్ శాట్ మిషన్ డైరెక్టర్ అక్షయ్, స్పేస్ కిడ్జ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నగరంలో స్కూజో ఐస్ క్రీమ్



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
విజయవాడలో మొట్టమొదటిసారిగా స్కూజో డెజర్ట్ కేఫ్ నూతనంగా ప్రారంభమైంది. గురునానక్‌కాలనీలో ఉషోదయ సూపర్ మార్కెట్ పక్కన శుక్రవారం స్కూజో డెజర్ట్ కేఫ్‌ను ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ అధ్యక్షుడు డి.రమేష్. ఓఎస్‌డి టూ స్పెషల్ సీఎస్ సిహెచ్.పద్మావతి ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు టి.మహాదేవ్, సిహెచ్.శ్రీనివాస్‌లు మాట్లాడుతూ విజయవాడలో మొట్టమొదటిసారిగా లైవ్‌లో డెజర్ట్ తయారు చేయడం స్కూజో డెజర్ట్ కేఫ్ ప్రత్యేకత అని ఎటువంటి కెమికల్స్ ప్రిజర్వేటివ్స్ లేకుండా ఫ్రూట్స్ నుండి తయారు చేసి హానీ బేసిడ్‌గా అందించడం తమ ప్రత్యేకత అని తెలిపారు. ఆధునాతన మిషనరీలతో తయారుచేసి మంచి క్వాలిటీతో పిల్లలు మాత్రమే కాకుండా పెద్దలు కూడా తమకు నచ్చిన డెసర్ట్‌ను అతి తక్కువ క్యాలరీలు కలిగినవి తిని ఆస్వాదించవచ్చునని అన్నారు. కూల్డ్ మరియు హాట్ బేవరేజస్‌లలో ఫలూదా, మొజిటో, కోల్డ్ కాఫీ, హాట్ చాక్ లెట్, కాప్పుఛీనో, ఎస్స్ ప్రెస్సో మొదలుగునవి లభిస్తాయని, హోమ్ డెలివరి సదుపాయం కూడా ఉన్నదని, పార్టీలకు ఫంక్షన్‌లకు సప్లయి చేస్తామని తెలిపారు.

## విజయవాడ నుంచి అరుణాచలానికి బస్సు సర్వీస్

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
ప్రయాణికుల కోసం ఏపీఎస్ఆర్టీసీ అనేక పర్యాటక కేంద్రాలకు బస్సులను నడుపుతుంది. తాజాగా శైవ క్షేత్రమైన తమిళనాడులోని అరుణాచలానికి పౌర్ణమి సందర్భంగా జూలై మూడవ తేదీన స్పెషల్ బస్సు సర్వీసులను ప్రారంభించింది. ఈ స్పెషల్ బస్సులు జూలై ఒకటవ తేదీ రాత్రి 9 గంటల సమయం ్రాచీదీూ బస్టాండ్ నుంచి అరుణాచలానికి బయలుదేరి మధ్యలో శ్రీకాళహస్తి కాణిపాకం గోల్డెన్ టెంపుల్ కలుపుకొని వెళ్తుంది ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాల్సిందిగా కోరడం జరిగింది.

## జూలై 8న ఎస్టీ ఉద్యోగుల సమ్మేళనాన్ని జయప్రదం చేయండి



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
అఖిలభారత ఆదివాసి ఉద్యోగుల సంఘం జాతీయ కమిటీ ఆధ్వర్యంలో ఎస్టీ ఆదివాసి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నవించుకోవడం జరిగిందని, జూలై 8న జరగబోయే ఎస్టి ఉద్యోగుల సమ్మేళన కరపత్రాన్ని ఆదివారం స్థానిక గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆవిష్కరించడమైనది. ఈ సందర్భంగా ఎస్టీ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆదివాసి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులను సంఘ నాయకులు కలిసినప్పుడు సరైన హామీలు లభించడం లేదన్నారు. కొంతమంది ఉన్నత స్థాయి అధికారులు కనీసం ఉద్యోగ సంఘ నాయకులకు అపాయింట్మెంట్లు కూడా ఇవ్వడం లేదని వెంకటేశ్వర్లు విచారం వ్యక్తంచేశారు. తదనంతరం పలువురు ఎస్టీ నాయకులు మాట్లాడుతూ, తోటి ఉద్యోగుల పట్ల అనుచితంగా వివక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఎస్టీ మహిళ ఉద్యోగులపై వివిధ రూపాల్లో జరుగుతున్న దాడులు అన్యాయాల పై సంబంధిత డిపార్ట్మెంటులో అధికారులు న్యాయపరంగా స్పందించాల న్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ నెలలో జరిగిన బదిలీల్లో అనేకచోట్ల ఎస్టి ఉద్యోగులకు అన్యాయం జరిగిందని అన్నారు. శాఖపరమైన పదోన్నతుల్లో రిజర్వేషన్ అమలుపరిచెక్రమంలో ఎస్టీ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. ఆడక్వసి రిచ్ అనే పదాన్ని జీవో నెంబర్ 2 నుంచి తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆమోదం పొందిన ప్యానెల్ లిస్టులను ఎస్టీ ఉద్యోగ సంఘ నాయకులు వెరిఫై చేసుకోవడానికి అనుమతించాలని కోరారు పదోన్నతులు కల్పించి ముందు డిపార్ట్మెంట్లో నిర్వహించే సమావేశాలకు ఎస్టీ ఉద్యోగులు సంఘం నాయకులకు ఆహ్వానించాలని ప్రభుత్వానికి కోరారు. ఉన్న ఎస్సీ ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులను భర్తీచేయాలని, ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేయాలని కోరారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు పర్మినెంట్ చేయాలని సచివాలయ ఉద్యోగులు సమస్యలను, కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు కొమరగిరి శ్రీనివాసరావు, కృష్ణాజిల్లా అధ్యక్షులు దేవరకొండ సాంబశివరావు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు కోతాడి శివబాలనాగరాజు, పాలపర్తి బాలాజీ, దేవరకొండ సురేష్, నల్లగొండ రామయ్య, ఎస్టీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## యోగా దినోత్సవం సందర్భంగా ప్లాట్ ఫామ్ 65 నుంచి ఆరోగ్యప్రియుల కోసం పోషకయుక్త ఆహారం

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
రుచికరమైన, ఆరోగ్యకరమైన భోజనాన్ని ఎవరు ఆస్వాదించరు? ఎలాంటి మానవ పరస్పర చర్య లేకుండా టాయ్ ట్రైన్‌లో మెషిన్‌లు మీకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించే రెస్టారెంట్‌కు వెళ్లడాన్ని ఊహించుకోండి. అసంభవం అనిపిస్తోంది కదూ? శుభవార్త ఏమిటంటే, ప్రస్తుతం మన సొంత నగరంలోనే ప్రతిదీ జరుగుతోంది.



ప్లాట్‌ఫామ్ 65 అనేది భారతదేశంలోని అతిపెద్ద టాయ్ ట్రైన్-సర్వ్ రెస్టారెంట్. ఇది మీ ప్రాంతంలో నోరూ రించే డైట్ డిష్‌ల రుచికరమైన శ్రేణిని రుచి చూసేందుకు, ఆస్వాదించేందుకు వీలుగా మీకు అందిస్తుంది. జూ న్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్లాట్‌ఫామ్ 65 తన ప్రత్యేక యోగా ఆహార వంటకాలను ప్రారంభించబోతున్నట్లు ప్రకటించింది. సచేతన, సంక్షేమాన్ని ప్రోత్సహించడంలో సహాయపడ టానికి ఆరోగ్యకరమైన, పోషకమైన పదార్థాలను కలిగి ఉన్న మెనుని రెస్టారెంట్ రూపొందించింది.

ప్లాట్‌ఫామ్ 65 మేనేజింగ్ డైరెక్టర్, వ్యవస్థాపకుడు సద్గుణ్‌పథ మాట్లాడుతూ, "యోగా కళ వలె, అంతర్జాతీ య యోగా దినోత్సవం సందర్భంగా సలాడ్‌ను ప్రవేశపెట్టడం అనేది పోషణ, శ్రేయస్సు సామరస్య కలయి క. మా ప్రతిష్టాత్మకమైన కస్టమర్‌ల కోసం ఆరోగ్యకరమైన ఆహారాన్ని ప్రోత్సహించడానికి అత్యంత శ్రద్ధతో రూపొందించబడిన రుచులు, వెల్‌నెస్‌ల కలయికను మా ప్రత్యేక వంటకాలు అందిస్తాయి. ఈ వంటకం యోగా సూత్రాలకు అనుగుణంగా ఉంటుంది. సమతుల్యత, జీవశక్తి, పోషణలను ప్రతిబింబిస్తుంది. ఈ రక మైన కార్యాచరణకు నేనెంతో ఇష్టపడుతాను. కలిసి, బాగా తినే కళను స్వీకరించి, అంతర్గత సామరస్య రుచిని ఆస్వాదిద్దాం"" అని అన్నారు. ప్రత్యేక వంటకాలు ఆరోగ్యాన్ని పెంపొందించడానికి, వారి కస్టమర్ల ఆరోగ్యం, వెల్నెస్‌కు సంపూర్ణమైన మద్ద తునిచ్చే లక్ష్యంతో ఆరోగ్యకరమైన, పోషకమైన పదార్థాలను కలిగి ఉంటాయి. "ప్రత్యేక మెనూలో వేగన్, గ్లూ టెన్ రహిత ఎంపికలతో సహా వివిధ రకాల మొక్కల ఆధారిత వంటకాలు ఉన్నాయి. ఇవి పోషకాలు, యాం టీ ఆక్సిడెంట్‌లతో సమృద్ధిగా ఉంటాయి. శ్రేయస్సును ప్రోత్సహిస్తాయి. క్యాప్సికమ్ గ్రౌండ్ నట్ సబ్‌జీ, సలాడ్‌లు, మరిన్నింటిని ఈ మెనూ హైలైట్ చేస్తుంది" అని విజయవాడలోని ప్లాట్‌ఫాం 65 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీత అన్నారు.

Printed, Published and Owned by KONDURI SRINIVASARAO, Printed at M/s Arunodaya Note Book Manufacturers Pvt Ltd, D.NO: 33-5-9 Pupiah Street, Seethurampuram, VIJAYAWADA, Krishna District, Andhra Pradesh and Published From H.No: 24-9/1-148, Ramanagar, Ramakoti Maidanam, Bavajipeta 1st Line cross, VIJAYAWADA Krishna District Andhra Pradesh.
Editor Konduri Srinivasarao, RNI Title APTEL/2021/80559, Phone :9948877444, Email id: konduri999@gmail.com